
కథ

# పేరెంటక్

వాడ్రేవు వీరలక్ష్మీదేవి



*ఈరోజు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికొచ్చేటప్పుడు బస్‌లో హేమ కనిపించింది. హేమ నాతో చిన్నప్పటినుంచి కలిసి చదువుకుంది. ఎంతో స్నేహంగా ఉండేది. ఆచారిగారి అమ్మాయి. చాలారోజులకి కనిపించింది. పెళ్ళి అయిపోయిందిట. అయిదోనెల కడుపుతో ఉందిట. భర్త పెద్ద ఇంజనీరుట. హేమ అందం చూసి కావాలని కోరి పెళ్ళి చేసుకున్నాట్ట. కట్నం తీసుకోలేదట. ఇవన్నీ హేమ చెప్పలేదు. వాళ్ళ అక్క చెప్పింది.*

*బస్ ఎక్కగానే ముందు సీట్లో హేమ కనిపించి నన్ను గుర్తుపట్టి ఎంతో సంతోషపడిపోయింది. పిలిచి పక్కకి జరిగి కూర్చోపెట్టుకుని మాట్లాడుతుంటే వాళ్ళ అక్క పక్కనే ఉంది. నన్ను చూసి మొదట గుర్తుపట్టలేదు. గుర్తుపట్టాక ఆశ్చర్యపోయింది. హేమ సంగతులు చెప్తూ నా వివరాలడిగింది.*

ఉన్నవన్నీ చెప్పాను. అలా చెప్తుంటే నేను చెప్పే ఒక్కొక్క విషయంలోంచీ ఆవిడ ఒక్కొక్క ప్రశ్నను పుట్టించింది. అలా ప్రశ్నలు వేస్తూ చాలా సంగతులు నాచేత చెప్పించింది. చివరికి ఇలా అంది.

"నువ్వు మా హేమకంటే అందంగా ఉన్నావు. ఠీవిగా ఉన్నావు. నీ జీవితానికి నువ్వు హీరోయిన్‌లా ఉన్నావు. నీమీద కథ రాయనా?" అంది.

ఆవిడ కథలు రాస్తుందట. మనుషుల్ని, జీవితాల్ని, సమాజాన్ని లోతుగా పరిశీలించడం ఆవిడకి ఇష్టమట. ఆ పరిశీలనలోంచి కొన్ని చిక్కుముళ్లు విప్పడానికి కథలు రాస్తుందట. అలా నా కథా రాస్తానంది.

కానీ ఆవిడ ఈ కాసేపూ విన్న నా సంగతులలోంచి మొత్తం నా అంతరంగాన్నెలా చూపెట్టగలదు? అదీ ఒక కథలో? ఆవిడకి నన్ను పూర్తిగా చెప్పుకోలేదే! నాలోపల ఎంత బాధ ఉందో, ఎంత కోపం ఉందో, ఎంత అవమానజ్వాల ఉందో ఆవిడ ఎలా అర్థం చేసుకోగలదు?

అప్పుడే తట్టింది నాకు. నా కథ నేనే రాసుకోవచ్చుకదా! అని.

బస్ దిగి మా హరిజన పేట దాకా నడిచి వస్తూ అదే ఆలోచించాను. నాగురించి నేనే అయితే బాగా ఆవిష్కరించుకోగలను. నేనే చెప్తాను. ఎవరికో కాదు. నాకు నేనే వివరించుకుంటాను. అనుకున్నాను.

మా పేటలో అడుగుపెట్టగానే కృష్ణ కనిపించాడు.

"ఏమే బాలమ్మా! విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అయ్యావుట. అందుకో నా కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు.

"అంత పేరొద్దులే. వి.ఎ.ఓ అను చాలు" అన్నాను. కృష్ణ చాలారోజులకి కనిపించాడు. ఆశ్రమ స్కూల్లో టీచరు. ఎంతో తెలివి, ఆసక్తి, శ్రద్ధ ఉండికూడా తల్లిదండ్రుల అజ్ఞానం వల్ల పైకి చదువుకోలేక ఈ స్కూల్ టీచరు ఉద్యోగంలో చేరిపోయాడు.

ఇప్పుడు వాడికి నామీద కోపం. నేను కూడా చదువు మధ్య ఆపేసి ఈ ఉద్యోగంలో చేరిపోయానని.

"ఇంతకన్న ఆ స్కూలు టీచరైనా బావుణ్ను. ఇదెంత పనికిమాలిన ఉద్యోగమో తెలుసా. ఎంతమంది కింద అణిగిమణిగి పడుండాలో నీకు తెలీదు" అన్నాడు.

"భయపెడుతున్నావా ఈవేళ కొత్తగా. ఇలాంటివి ఎన్ని పడలేదు మనం! చిన్నప్పటినుంచీ ఉన్నవే కదా! చూడు ముందుముందు నీకే తెలుస్తుంది ఎందుకు చేరానో" అంటూ గబగబా నడిచి మా ఇల్లు అనబడే పాక దగ్గరికి చేరుకున్నాను, మా అమ్మ ఎదురు చూస్తూ ఉంటుందని.

మా అమ్మ పాక బయట పొయ్యిమీద అన్నం వండుతోంది. నన్ను చూసి గబగబా లోపలికి వెళ్ళి కాచిన టీ తెచ్చి వెచ్చబెట్టి గాజుగ్లాసులో పోసి ఇచ్చింది.

వాకిట్లో నులకమంచం వాల్చి ఉంది. దానిమీద కూర్చుని టీ తాగుతూ అమ్మకి హేమ సంగతులు చెప్పాను.

"ఆయమ్మ అదుట్టమంతురాలు. మంచి సమ్మందం వచ్చిందనమాట. నీకెక్కడ రాసేడో ఆ దేవుడు" అంటుంటే అమ్మ గొంతు వణికింది.

తరచుగా అమ్మగొంతు అలా వొణుకుతూ ఉంటుంది. పైకి ఏడుపురాదు లోపల దుఃఖం పోదు. ఆ లోపలి ఏడుపుకే ఆవిడ కుంగిపోయి ఎండిపోయింది.

మా అమ్మ గట్టిగా ఏడ్చేస్తే బావుండునని ఉంటుంది నాకెప్పుడూ. అప్పుడు ఆవిడ బరువు దిగుతుందేమోనని.

అమ్మ రాత్రి పొద్దుపోయాక నాకు స్నానానికి ఉడుకునీళ్లు పెట్టింది. చదువుకున్నాక నా భాష చాలామారింది. కాని చిన్నప్పటి కొన్ని మాటలు వదలబుద్ధికాదు. ఉడుకునీళ్లు అన్నమాట అలాంటిది. నవంబరు నెల చలి. అయినా సరే ఆ చలిలోనే స్నానం చిన్నప్పటి నుంచీ అలవాటు. అమ్మ పొద్దున్న నీళ్లు పోసేదికాదు. సాయంత్రం చీకటిపడ్డాక ఉడుకు నీళ్లు కాచి పోసేది. ఇప్పుడు నేను ఉదయం స్నానం అలవాటు చేసుకున్న సాయంత్రపు అలవాటు పోలేదు.

చలిలో పాక వెనక వెన్నెల్లో వేడినీళ్లలో స్వేచ్ఛగా స్నానం చేసాను. నా తెల్లని ఒళ్లంతా వెన్నెల్లో మెరిసింది. నేను మా అమ్మలా నల్లగా పుట్టనందుకు అప్పుడప్పుడు బెంగగా ఉంటుంది. ఇలాంటప్పుడు మరీను. నల్లటి ఒళ్లు అయితే ఇంకా ఎంత బాగా మెరిసిపోను!!

నేను ఎత్తుగా ఉంటాను. అయిదడుగుల అయిదంగుళాలు అని స్కూల్లో మా పి.డి.గారు కొలిచి చెప్పారు. తెల్లటి తెలుపు. సూది ముక్కు. సాపు జుట్టు. కోలకళ్లు. అంతా మా నాన్న పోలికే. మా నాన్నకీ తెలుసు. ఊరందరికీ తెలుసు. ఊరందరూ నన్ను గుచ్చిగుచ్చి చూడడం చిన్నప్పుడు ఒకందుకయితే, ఇప్పుడు మరొకందుకు. ఇప్పుడయితే నేను గర్వపడుతూ ఉంటాను అలా చూస్తున్నందుకు.

మెరుస్తున్న ఒంటిమీది వెన్నెలని తువ్వాలుతో అద్ది చిన్నిచిన్ని పూలున్న నైటీ వేసుకున్నాను. మధ్యాహ్నం అమ్మ ఉతికి, గంజిపెట్టి ఉంచింది. నన్ను చిన్నప్పటి నుంచి అలాగే చూస్తూ వచ్చింది యువరాణిలా. నేను మా అమ్మను కనీసం మనిషిగా అయినా బతగ్గలిగేలా చెయ్యగలనా?

అన్నం తిని పాకలోకి తెచ్చి వేసిన నులకమంచం మీద అమ్మ పక్కనే పడుకున్నాను. ఈ పాకలో కొత్తగా చేరిన కొన్ని వస్తువులతో మా ఇల్లు చిత్రంగా ఉంటుంది. ఒకవేపు కుండలు, మూకుళ్లు మరోవేపు పుస్తకాలు చిన్న సూట్‌కేసూ దణ్ణెంమీద మా అమ్మ పాత చీరలు నా పంజాబీ డ్రెస్‌లు, నైటీలు. అంతా కలగలిసిపోయి. ఈ ఇంట్లో అమ్మా, నేనే. మా అన్న పెళ్ళి చేసేసుకుని అత్తగారి ఇంటికి వెళ్ళిపోయాడు. అమ్మా, నేనూ మిగిలేం. ఈ పాకతో ఇంకా మాకు ఎన్నాళ్లు ఋణ

మో! ఈ ఒక్క పనీ అవగానే ఈ ఊరి నుంచి ఆ ఊరు వెళ్ళిపోతాం. ఆ పనేమి టో చెప్తాను. అది చెప్పేముందు నా కథ చెప్పాలి. నేనే చెప్తానన్నాను కదా!

** ** **

నాకు నాన్న అంటే ఏమిటో తెలీదు. నాకు ఊహ తెలిసినప్పటినుంచీ అమ్మే ఉంది. మా అన్న పుట్టాక మా నాన్న చచ్చి పోయాడని చెప్పుకునేవారు. ఇప్పుడు తెలుస్తోంది. ఈ కొండ ప్రాంతాల నీళ్ళల్లో కాల్షియమ్ తక్కువట. ఎముకలకి క్షయ వస్తుందిట. ఎంతోమంది అలా చచ్చిపోతే ఉంటారు. కారణం తెలుసుకోరు. అంత అజ్ఞానం. తెలిసినా వైద్యానికి డబ్బు ఉండదు. మా నాన్న అలా చచ్చిపోయాడు.

నేను హరిజన పేట నుంచే ఊళ్లో ఎలి మెంటరీ స్కూలుకి వెళ్ళేదాన్ని. మధ్యాహ్నం మా అమ్మ అక్కడే ఓ భూస్వా మి ఇంట్లో ఉండేది. అక్కడికి వెళ్తే ఇంటి వెనకాతలకి తీసుకుపోయి చల్లారిన అన్నంలో పులుసు కలిపి నాకు తినిపించేది.

అమ్మ అక్కడ వడ్లు దంచుతూ, అరుగులు అలుకుతూ గిన్నెలు కడుగు తూ, చెత్త ఊడుస్తూ, పేడలు తీస్తూ ఎప్పుడూ ఆ ఇంటి చాకిరీ చేస్తూ ఉండేది. అతని పిల్లలు కూడా మా బళ్లోనే చది వారు. ఆ పిల్లలు నాతో మాట్లాడే వారుకాదు. ఇంటికి వెళ్ళినా దూరంగా చూసేవారు. ఆ ఇంటివాళ్లు నన్ను ఇంటి అరుగు కూడా ఎక్కనిచ్చేవారు కాదు. వాకి ట్లో ఓ మూల మా అమ్మ వచ్చేదాకా కనిపె ట్టుకుని కూచునేదాన్ని.

స్కూల్లో మిగతా పిల్లలు బాగా మాట్లా దేవాళ్లు. స్కూల్లో పాఠాలతో పాటలతో ప్రేమగా చూసే పంతులమ్మలతో ఎంతో సంతోషంగా గడిచేది.

ఇంటికెళ్తే ఆటలకి వెళ్లి తిరిగి తిరిగొచ్చి న అన్నని అమ్మ చితకబాదడం, అన్న బూతులు తిట్టడం, అమ్మ ఏడవడం చూస్తే దిక్కుతోచేది కాదు. బెంగగా అన్నం తినకుండా ఓ మూల పడుకుని నిద్రపోయేదాన్ని.

సగం రాత్రి మెలుకువ వస్తే ఒకోసారి అమ్మ కనిపించేదికాదు. నా పక్కన పడుకుని అన్న కన్నీటి చారికల మొహం తో బెక్కుతూ నిద్రపోతూ ఉండేవాడు.

పొద్దున్నే అమ్మ నిద్రలేపేది. అన్నకి బట్టలు తొడిగి తల దువ్వి బుద్ధులు చెప్పే ది. రాత్రికి మళ్లీ మామూలు. ఎన్నాళ్లయి నా మార్పులేని అదే జీవనం. బెంగతో నిండిన బాల్య జీవనం.

** ** **

కొన్నాళ్లకి అంటే నాకు పద్దెనిమిదేళ్ల దాటేటప్పటికి నెమ్మదినెమ్మదిగా అర్థమైం ది. ఎవరూ, ఎవరినోటితోటీ ఆ మాట చెప్పకపోయినా ప్రశ్నలు, సందేహాలు, సగంసగం మాటలూ తెలియజెప్పాయి. నారూపం కూడా నాకు చెప్పడం మొద లుపెట్టింది.

వయసుకుంటె ముందుగా శరీరంతో పెరిగాను. చదువు వయసుతో పెరగలే దు. ఎన్నో కారణాలు. చదువుమీద ఎంతో ప్రేమ. కానీ ఎంత కష్టపడినా వచ్చేదికాదు. ఎనిమిదో క్లాసులో ఉండగా జరిగిందది. మా ఊరి నుంచి పొరుగూ రికి వెళ్లి అక్కడున్న ఆశ్రమ పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటూ ఉన్నప్పుడు.

ఆ స్కూలు వార్షికోత్సవం. చుట్టుపక్క ల ఊళ్ల పెద్దలు అందరూ వచ్చారు. మా అమ్మ పనిచేసే ఇంటి కామందు భూష య్యగారు కూడా వచ్చాడు. ఆరడుగుల మనిషి. దబ్బపండుఛాయ. సూదిముక్కు. అందరూ గుసగుసలాడుకోవడం మొద లుపెట్టారు. ఒక టీచరు పనిగట్టుకుని అడిగింది- "మీ నాన్నొచ్చాడు చూసావా" అని.

ఒక్క పెట్టున ఏడుపొచ్చింది ఆ మాట వినగానే. ఇన్నేళ్లుగా ఉన్నది అమాంతంగా బద్దలయినట్టనిపించింది. తల ఎత్తలేక పోయాను. తలవంచుకునే డార్మెట్రీలోకి పారిపోయాను. విస్ఫోటనం అని తెలుగు మేష్టారు చెప్పిన మాట కళ్లముందు మెది లింది. ఆరోజునాటి నా రహస్యం బద్ద లయినప్పటి నా అవమానం హేమా వాళ్ల అక్క ఎంత రచయిత్రి అయినా ఎలా రాయగలదు?

ఆ మర్నాటి నుంచి నాలో చిత్రమైన కోరిక మొదలైంది. అతను మా నాన్న అని అందరికీ చెప్పుకోవాలని. మా అమ్మ ని అడగాలని ఉండేది "అమ్మా మా నాన్నేకదా" అని. కానీ అమ్మ మొహం చూస్తే భయం వేసేది. అమ్మ చూపులు దిగులుగా భయంగా ఉండేవి. ఈ ప్రశ్న ఎప్పుడేనా అడిగేస్తానేమోనని భయపడు తున్నట్టు ఉండేది.

ఎవరికీ చెప్పుకోలేను. ఎవర్నీ అడగలే ను. అలాగలాగ ఇరవైఏళ్ల దాన్నయ్యాను.

** ** **

వి.ఎ.ఓ.గా చేరిన తర్వాత ఏడాదికే నాకు ఎంతో అనుభవం వచ్చింది. ఎన్నో లావాదేవీలు తెలిసాయి. చదువుని సరిగా పనిచేయని బుర్ర లావాదేవీలు పనిగట్ట డంలో చురుగ్గా పనిచేయడం మొదలుపె ట్టింది.

భూషయ్య తండ్రి ఇక్కడివాడు కాదు. పైనుంచి వచ్చి ఇక్కడ భూములు కొని కాంట్రాక్టులు చేసి డబ్బు సంపాదించాడు. ఇల్లు కట్టాడు. ఆ కొన్న భూములు, ఇల్లు కట్టిన భూమి అన్నీ గిరిజనులవే. గిరిజ నుడికి ఆశే తెలీదు. అత్యాశ ఎక్కడ? ఆరో జు గడిచిపోతే చాలు. అలాగే వాళ్ల భూములు 'తనఖా'లకి అమ్మకాలకీ అతి తక్కువ ధరలకే వదిలేసుకుంటారు. భూషయ్యలాంటి వాళ్లు అలాగ భూమి సంపాదిస్తారు. ఇప్పుడు భూషయ్య తాలూకు భూములమీద ఎన్ని పిటీషన్లనే నా పెట్టించి వెయ్యవచ్చు. మొత్తం భూములన్నీ ట్రైబల్ లాండ్స్ అని చెప్పి స్వంతదార్లకి అప్పజెప్పించేయవచ్చు.

ఇందుకే వి.ఎ.ఓ అయ్యానని చెప్తే కృష్ణ నవ్వుతాడు. 'నీమొహం' అంటాడు. కానీ కృష్ణ గిరిజన యువకుడు. నేను అలాకాదు. నా రక్తంలో మోసగించే గుణం, దగా చేసే లక్షణమూ ఉన్నాయి. నేను వాటిని ఎదురుదెబ్బ తియ్యడానికే ఉపయోగిస్తున్నాను.

అమ్మని భూషయ్య రేప్ చేసాడు. ఒకసారి కాదు. ఎన్నోసార్లు. ఒక రేప్‌లో నేను పుట్టి ఉంటాను. అమ్మ ఎన్నో రేప్లకి గురి అయింది. అయినా ఆ ఇంట్లో పని చేసింది. భయంవల్ల.

రేప్‌కంటే దారుణం దొంగతనం నింద. మూడు పేట్ల గొలుసు కనపడలేద ని ఇల్లు తుడిచే అమ్మని అవమానించి దొంగగా నింద వేసారు. ఆ దృశ్యం కళ్ల ముందు నుంచి కరిగిపోదుగాక కరిగి పోదు.

అమ్మ చీర విప్పేసారు ఆ ఇంటి ఆడవా ళ్లు. చీర ముడిలో దాచి వుంటుందని. జాకెట్టు వెతికారు. ఎండిపోయిన ఎముల అమ్మ బాబోయ్.. బాబోయ్.. అని ఏడ్చిం ది. తల్లీకూతుళ్లం దొంగలుగా ఆ ఇంటి నుంచి వెలిపడ్డాం. ఇది గుండెల్ని ప్రతి క్షణం చీల్చుతూ ఉంటుంది. హేమా వాళ్ల అక్కకి ఎలా తెలుస్తుంది? చీలిన గుండె పోటు చెప్పే గోడు?!!

అతను మా నాన్న కాదు. దుర్మార్గుడు. మూడు పేట్ల గొలుసు దొంగతనంగా పట్టుకుపోయి ఎవరికో అతనే ఇచ్చుకున్నా దని తరువాత ఊళ్లో చెప్పుకున్నారు.

అమ్మ వంటిమీద ఎన్ని ఎముకలున్నా యో, మనసుకి అన్ని తూట్లు పడి ఉంటాయి. అవన్నీ నేను అతకగలనా?

ఇంటర్మీడియట్ అయిన తర్వాత వి.ఎ.ఓ పోస్టుకి అప్లికేషన్ పెట్టించాడు మా వూరి పాత మునసబు. ఆయన మామీద దయగా ఉండేవాడు. రెండు నెలల్లో ఆర్డర్లు వచ్చేసాయి. పోస్టింగ్, ట్రైనింగ్ అంతా గబగబా జరిగిపోయింది. ఏ అప్లికేషన్‌లోనైనా తండ్రి పేరు దగ్గర తల్లిపేరు, వృత్తి దగ్గర కూలిపని అని రాయడం అలవాటైపోయింది. అదేనాకు ఉద్యోగం తెచ్చిందిట. ఉద్యోగాల్లో ఉన్న గిరిజన కోటా, మహిళల కోటా నా చదు వును మధ్యలో మాన్పించింది గానీ అది వేరే సంగతి.

మునసబుగారు చెప్పినమాట విన్నరో జు నేను ఎంతో ఆశ్చర్యపోయాను.

ఆ స్కూలు వార్షికోత్సవం. చుట్టుపక్కల ఊళ్ల పెద్దలు అందరూ వచ్చారు. మా అమ్మ పనిచేసే ఇంటి కామందు భూషయ్యగారు కూడా వచ్చాడు. ఆరడుగుల మనిషి. దబ్బపండుఛాయ. సూదిముక్కు. అందరూ గుసగుసలాడుకోవడం మొదలుపెట్టారు. ఒక టీచరు పనిగట్టుకుని అడిగింది- "మీ నాన్నొచ్చాడు చూసావా" అని. ఒక్క పెట్టున ఏడుపొచ్చింది ఆ మాట వినగానే. ఇన్నేళ్లుగా ఉన్నది అమాంతంగా బద్దలయినట్టనిపించింది. తల ఎత్తలేకపోయాను. తలవంచుకునే డార్మెట్రీలోకి పారిపోయాను. ఆరోజునాటి నా రహస్యం బద్దలయినప్పటి నా అవమానం హేమా వాళ్ల అక్క ఎంత రచయిత్రి అయినా ఎలా రాయగలదు?



"భూషయ్యకి పుట్టిన దానివని మాకందరికీ తెలుసు. కానీ ఆ సంగతి నువ్వుగానీ అతనుగానీ కాయితాలమీద ఒప్పుకున్నారంటే నీ ఉద్యోగం పోతుంది సుమా!" అన్నాడు.

నా తెల్లమొహం ఆయనకి అర్ధమైంది. అందుకే మళ్ళీ చెప్పాడు. "అతను నాన్ ట్రైబల్. మీ అమ్మ వాల్మీకి. (గోదావరి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలోని హరిజనుల్ని వాల్మీకులంటారు. వాళ్లు గిరిజనులవుతారు) నువ్వు మీ అమ్మ కూతురిగా ఎస్.టి సర్టిఫికెట్ తెచ్చుకున్నావు. తండ్రిగా అతని పేరు రాస్తే నీకు ఎస్.టి సర్టిఫికెట్ రాదు"

ఇరవై రెండేళ్ల వయస్సులోనే నాకు జీవితంలోని అసంబద్ధత అలా అర్ధమైంది. తండ్రిపేరు చెప్పకపోవడం వల్లనే నాకు ఈ సంఘంలో గౌరవప్రదమైన స్థానం లభిస్తోంది.

ఆ స్థానం కోసమే చిన్నప్పటి నుంచి అతన్ని నాన్నా అని పిలవాలని ఉబలాటపడేదాన్ని. ఒకసారి పిలిస్తే లాగి లెంపకాయ కూడా కొట్టాడు. ఇంకెప్పుడైనా అలా పిలిచావో నీ అంతు చూస్తానన్నాడు. కానీ మా అమ్మ కులమే, జాతే నాకు గౌరవాన్ని తెస్తోంది ఇప్పుడు.

ఆగకుండా గబగబా కన్నీళ్లు వచ్చేసాయి. ఆ పెద్దమనిషి చూసి గ్రహించుకున్నట్టున్నాడు. మాట మార్చాడు.

"చూడమ్మాయ్! నీకు ఏ అవసరం వచ్చినా సలహా కావలసి వచ్చినా నన్ను వచ్చి అడుగు" అని ధైర్యం చెప్పి పంపాడు.

ఈ రాత్రి ఈ పాత సంగతులన్నీ గుర్తొస్తున్నాయి. హేమా వాళ్ల అక్క కథ- హీరోయిను అనగానే చిత్రంగా అనిపించింది. నేను విడిగా నిలబడి నా పాత సంగతులు గుర్తు చేసుకుంటే నిజంగా కథే అనిపిస్తోంది.

కానీ అసలు కథ ముందుకదా ఉన్నది. ఆ కథంతా జరిగాక ఈ కథ చెప్పడం పూర్తి చేస్తాను.

బైట వెన్నెల కాస్తూనే ఉంది. ఈ పూరిపాకలో గుడ్డిదీపపు వెలుతురు. అమ్మ నిద్రపోతోంది. ఆ వెన్నెలని ఈ పాకలోకి తేలేనా నేను అని ఆలోచిస్తుండగా ఎప్పటికో నిద్రపట్టింది.

** ** **

పూరిపాకలోకి వెన్నెల వచ్చింది. సరిగ్గా ఏడాది తర్వాత అలాఅని హేమా వాళ్ల అక్కకి ఉత్తరం రాస్తాను. ఆ వెన్నెల ఎలా విరిసిందో కూడా చెప్తాను మరి!

భూషయ్యకి ఉన్న పాతిక ఎకరాల పల్లం, ముప్పై ఎకరాల మెరకా మొత్తం ఏభై అయిదు ఎకరాల భూములూ బినామీ పేర్లమీదే ఉన్నాయి. మా హరిజనవాడలో ఇద్దరు, ఊర్లో కోయదొరలు ముగ్గురు బినామీలు. అందరూ తిండికి లేకుండా ఉన్నవాళ్లే.

వరసగా మునసబుగారి సహాయంతో అందరిచేతా ఆరునెలల వ్యవధిలో పిటీషన్లు పెట్టించాను.

మొదట భూమయ్య హైకోర్టు నుంచి 'స్టే' తెచ్చుకున్నాడు. కానీ మళ్లీ మళ్లీ ట్రైబల్ ఆఫీసర్లకి, ట్రైబల్ కలెక్టర్‌కి పిటీషన్లు వెళ్తూనే ఉన్నాయి. ఒకసారి ట్రైబల్ మొబైల్ కోర్టులో కొంత పొలం అప్పజెప్పేసారు.

ఈలోగా స్కూటర్ ఏక్సిడెంట్‌లో భూషయ్య కాలు విరిగింది. మూడునెలలు మంచంమీదే ఉండాలిట. కొడుకులు తాగుబోతులైపోయారు. ఏదీ పట్టించుకోరు. ఇంటిమీద కూడా

"నన్ను భూషయ్యా అంటావా! నీ తండ్రిని కాదా! ఆ సంగతే చెప్పి నీ ఉద్యోగం పీకించేస్తాను. నువ్వు 'నాన్‌ట్రైబల్' కూతురివి" అన్నాడు.



కేసు నమోదైంది. గిరిజనుడి స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్నందుకు. ఆ ఇల్లు తొలగించమని 'ఆర్డర్సు' వెళ్ళాయి.

అప్పుడు ఆ ఇంటినుంచి నాకు కబురొచ్చింది. ఆ కబురు కోసమే చూస్తున్నాను.

నేను ఆ ఇంటి గుమ్మంలో అడుగుపెట్టాను. ఆ ఊరి విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా. నా ఆకారం, నా అందం, నా ఠీవి నా చిన్న ఉద్యోగాన్ని పెద్దది చేసాయి. అంగుళమున్నర హీల్ ఉన్న జోళ్లు విప్పకుండా ఆ ఇంటి గుమ్మంలోంచి లోపలికి వెళ్ళాను.

భూషయ్య పెళ్ళాం గబుక్కున నన్ను చూసి ఎవరో అనుకుని నమస్కారం చూసింది. నేను ఫలానా అని చెప్పగానే మొహం మాడిపోయింది. భూషయ్య గది దాకా తీసుకువెళ్ళి లోపలికి వెళ్ళమంది.

లోపల భూషయ్య మంచంమీద పడుకుని ఉన్నాడు. కాలికి కట్టు. చూశాడు. కూచోమని అనలేదు. నుంచోబెట్టే మాట్లాడాడు.

"ఏమే! నీకెంత పొగరు! నామీదే పిటీషన్లు పెట్టిస్తావా! నీ అంతు తేలుస్తాను చూడు" అన్నాడు.

నేను నవ్వుని వదలలేదు. లేక అదే నన్ను వదల్లేదేమో!

"ఏం చేస్తావు భూషయ్యా! కుంటికాలితో" అన్నాను.

"నన్ను భూషయ్యా అంటావా! నీ తండ్రిని కాదా! ఆ సంగతే చెప్పి నీ ఉద్యోగం పీకించేస్తాను. నువ్వు 'నాన్ ట్రైబల్' కూతురివి" అన్నాడు.

ఒక్కసారి పగలబడి నవ్వాలనిపించింది. గది బయట భూషయ్య భార్య ఉండి ఈ మాటలన్నీ వింటూ ఉండి ఉంటుంది. ఆమెకి ఒక్కసారిగా ఎన్ని దుఃఖాలో పాపం!!


"భూషయ్యా! నేను నీ కూతుర్నే. ఆ సంగతి నువ్వు ఈ నాలుగు గోడల మధ్యే చెప్పగలవు. అదికూడా కక్షతో. కానీ నాకు తండ్రిలేదు. తల్లే ఉంది. తల్లి ఒక్కతే తండ్రిని నిర్ధారించేదని ప్రపంచానికీ, న్యాయస్థానానికీ అందరికీ తెలుసు. ఆమె నీ పేరు చెప్పదు. నీలాగ పరువు భయంతోకాదు. నా భవిష్యత్తు మీద ప్రేమతో.

ఇంకా నామీద నువ్వు మరేవిధంగా కక్ష తీర్చుకోవచ్చో తీరిగ్గా ఆలోచించుకో" వస్తాను. అని చరచరా బయటికి వచ్చేసాను. ఆ ఇంటి నుంచి బయటికి రాగానే ఒంట్లోంచి ఆవిర్లు పైకి ఉబికాయి. నాకు నేను ఎంతో ఎత్తుగా అనిపించాను. బలంగా కూడా అనిపించాను. ఇప్పుడు మా అమ్మని నేను మనిషిని చెయ్యగలనన్న ధైర్యం కలిగింది.

ఈ సంగతంతా ఆ రచయిత్రికి రాస్తూ మరో విషయం కూడా రాస్తాను. ఇంక ఈ వి.ఎ.ఓ పోస్టు నాకు అవసరం లేదు. గిరిజన పాఠశాలకి టీచరుగా వెళ్ళిపోతున్నాను. నాలాగ తల్లి మాత్రమే ఉండి తండ్రిలేని ఎందరో పిల్లలకి తండ్రిని కావాలని.

ఈ బాలమ్మ ఇప్పుడు బేల కాదు. ధీర అని ఆమెకి రాస్తాను. ఆమె అయితే ఈ కథని ఇంకా బాగా శిల్ప నైపుణ్యంతో శైలీ విన్యాసంతో చెప్పగలుగునేమో! కానీ నేను చెప్పుకోవడంలో నా తృప్తి ఇంకొకలా ఎలా సాధ్యం?!

ఇలా ఆలోచించుకుంటూ కాలిబాట దాటి రోడ్డు మీద అడుగుపెట్టాను. ●



## రజనీ రూటేవేరు

తమిళనాట రజనీకాంత్ అభిమానులకు ఎప్పుడూ రెండు విషయాలు యమ సస్పెన్స్‌లో పడేస్తుంటాయి. అందులో ఒకటి ఇంకా సస్పెన్స్‌గా కొనసాగుతుంటే, మరొకటి సస్పెన్స్... తర్వాత సస్పెన్స్‌గా కొనసాగుతూంటుంది. మొదటి రజనీ రాజకీయాల్లోకి ఎప్పుడు ప్రవేశిస్తారు? అన్న ప్రశ్న. మరొకటి రజనీ కొత్త సినిమా ఏంటి? ఎప్పుడు? అన్నది. కోయంబత్తూరు లాంటి స్మాల్‌టెరిటరీఏరియాలో సైతం రజనీకాంత్ పడయప్ప మూడుకోట్లపైగా వసూలు చేసింది. రజనీ సినిమా హక్కుల్ని 23- 26 కోట్లకు కొనడానికి కూడా అక్కడ సిద్ధం. కోట్లాది తమిళ అభిమానుల గుండెల్లో సూపర్‌స్టార్ వెలిగిపోతున్న రజనీ సైకాలజీ చాలా టిపికల్‌గా ఉంటుందంటారు. కమర్షియల్ సినిమాలో నటించడం, తన అభిమానులను ఉత్తేజపరచే కథల్నే ఎంపిక చేసుకోవడం ఓవైపు రజనీ స్టయిల్ అయితే మరోవైపు రాఘవేంద్రస్వామి గురించి, రమణమహర్షి ఫిలాసఫీ గురించి గంటల తరబడి మాట్లాడటం కూడా రజనీ స్టయిలే. ఇప్పటికీ అంబాసిడర్ కారులోనే తిరుగుతూ... సెల్‌ఫోన్‌లలాంటి హడావుడి ఏమీ లేకుండా ఉండే రజనీ తన కష్టకాలం సాయపడ్డ మిత్రులందర్నీ పేరుపేరున గుర్తుపెట్టుకోవడమే కాదు... తన సినిమా వ్యాపారంలో భాగస్వాములను కూడా చేశాడు. ఆ మిత్రుల్లో రజనీ కర్ణాటకలో బస్‌కండక్టర్ పనిచేసినప్పుడు ఉన్న డ్రైవర్లు, కండక్టర్లే ఎక్కువ. ఏడాదిలో ఓసారైనా చెప్పాపెట్టకుండా హృషికేశ్ ఇంకా ఇతర హిమాలయపర్వత ప్రాంతాల్లో తిరుగుతూ యోగుల్ని కలుసుకునే రజనీకాంత్, బెంగళూర్‌కు వెళితే మటుకు తనచిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఎంచక్కా డ్రింక్స్ తీసుకుంటూ హాయిగా గడుపుతాడట. ఆ సమయంలో అక్కడ స్టార్‌డమ్, సూపర్‌మ్యాన్‌లాంటి ఇమేజ్‌లేవి ఉండవట. రజనీ చిటికేస్తే... తమిళనాట రాజకీయరంగంలో కుదుపు తప్పనిసరి. సినిమాల్లోనైతే కోట్ల కలెక్షన్లు మస్ట్. సినీరంగంలో ప్రవేశించి పాతికేళ్ళు పూర్తిచేసుకున్న రజనీకాంత్‌ను ఇటీవలే పరిశ్రమ, పెద్దలు భారీఎత్తున సన్మానించుకున్నారు.